క్లుప్తంగా

పెంపుడు కుక్కలకు టీకాలతో కుటుంబానికి రక్ష

కాకినాడ రూరల్: పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేయించడం వల్ల కుటుంబ సభ్యులకు వాటి నుంచి రక్షణ ఏర్పడుతుందని తిమ్మాపురం పశువుల ఆస్పత్రి వైద్యుడు తలాటం సురేష్ పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం బోట్‌క్లబ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ వ్యాధిపై ఆయన అవగాహన కల్పించారు. రేబిస్‌తో ఏటా ప్రపంచ వ్యాప్తంగా 60వేల మంది మరణిస్తున్నారన్నారు. అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, యనమల రామం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బోట్‌క్లబ్: ఇంద్రపాలెం విద్యుత్ ఉపకేంద్రం వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ జి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంద్రపాలెం ఉపకేంద్రం పరిధిలోని చీడిగ, ముసలమ్మతల్లి గుడి ప్రాంతం, గంగానాపల్లి, రేవూరు, కొవ్వాడ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

కార్మిక సంఘాల మానవహారం

కాకినాడ సిటీ: వచ్చే నెల మూడో తేదీన నిర్వహించే ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సన్నాహక సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశం గురువారం కచేరిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ప్రపంచ కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడానికి 1945 అక్టోబర్ 3న ఈ సమాఖ్య ఏర్పడి 78 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ భవన్ వద్ద సంఘీభావ మానవహారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు తోలక ప్రసాద్, దువ్వా శేషుబాబ్జీ, గొడుగు సత్యనారాయణ, తాళ్లూరి రాజు, అంజిబాబు, చెక్కల రాజ్‌కుమార్, వెంకటరమణ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శనీయుడు భగత్‌సింగ్



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఐడీఏ సభ్యులు

బోట్‌క్లబ్: నేటి యువత భగత్‌సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా గురువారం స్థానిక జగన్నాథపురంలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. అసోసియేషన్ సభ్యులు వీవీరావు, వెదురుపాక సతీష్, చైతన్య, నాగేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి యెహోవా సాక్షుల సమావేశం

కరప: మండలం నడకుదురులోని కుసుమ సత్య ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు యెహోవా సాక్షుల సమావేశం నిర్వహించనున్నట్టు స్థానిక ప్రతినిధి కె.వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరు వేల ప్రాంతాల్లో ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. భారతదేశంలో 40 కన్నా ఎక్కువ నగరాల్లో 74 సమావేశాలు జరుగుతాయన్నారు. ఓర్పు చూపించండి అనే అంశంపై చర్చ సాగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఓర్పు అనే లక్షణం ఎలా అవసరమో, ఈ లక్షణంలో ఉన్న వివిధ అంశాలపై మూడు రోజులు పరిశీలన చేస్తారన్నారు. భార్యా, భర్తలు, పిల్లలు, పెద్దలు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

సవరించిన వేతనాలు డిస్కంకూ అమలు చేయాలి

సామర్లకోట: ఔట్ సోర్సింగ్ సిబ్బంది విషయంలో అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఏపీ ఈపీ డీసీఎల్-డిస్కం కార్మిక సంఘ ఉమ్మడి జిల్లా చైర్మన్ వీసం వీరనాగు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1500 మంది ఈపీడీసీఎల్‌లో ఔట్‌సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారని, కార్మికుల వేతనాల సవరణకు యాజమాన్యం, కార్మిక సంఘ నాయకులతో చర్చించి ఆగస్టు 14న వేతనాలను సవరిస్తున్నట్టు ప్రకటించి డిస్కం కార్మికులకు ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. ముఖ్యమంత్రి నుంచి ఆమోదం లభించినా అధికారులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

రూ.50 వేల విరాళం

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు గురువారం రూ.50 వేల విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురానికి చెందిన వైజాగానికి వల్లభరావు, వెంకయ్యమ్మ ఈ విరాళం అందజేసినట్టు ఆయన వివరించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు పాల్గొన్నారు.



కాకినాడ సూర్యారావుపేట బీచ్‌కు వినాయకుడిని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న భక్తులు



కరపలోని మెరకవీధి కమిటీ ఆధ్వర్యంలో గజాననుని గ్రామోత్సవం





కాకినాడ రూరల్ నియోజకవర్గం కరపలో వివిధ గ్రామాలలో నిమజ్జనాలకు వెళ్తున్న వినాయక శోభా యాత్రలు

నిమజ్జలాల్లో లంబోదరుడు

- అమ్మ ఒడికి చేరుకున్న గణపయ్య
- సూర్యారావుపేట బీచ్‌లో సుమారు 450 విగ్రహాలు నిమజ్జనం
- తొలి రోజు రాత్రి 11 గంటల వరకూ అనుమతి
- ప్రశాంతంగా ముగిసిన నవరాత్రులు

కాకినాడ రూరల్: లంబోదరుడు నవరాత్రి పూజలు అందుకుని భక్తులు సమర్పించిన కుడుములు, బహుమతులు, విన్నపాలు, వేడుకోళ్లను అందుకుని గురువారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. కాకినాడ నగర, రూరల్ నియోజకవర్గాల్లో గణపతి విగ్రహాలకు గురువారం శోభాయాత్ర నిర్వహించి కైలాశానికి సాగనంపారు. ఆయా ఉత్సవ కమిటీలు కాకినాడ ఉప్పుటేరు వద్ద రెండు ప్రాంతాలతో పాటు, సూర్యారావుపేట బీచ్‌లో నిజమజ్జనం చేశారు. వాటితో పాటు జిల్లాలోని సామర్లకోట, పెద్దాపురం తదితర ప్రాంతాల నుంచి కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌కు ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, వ్యాన్‌లు తదితర వాహనాలతో ఊరేగింపుగా గణపయ్యను తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. భక్తుల రక్షణకు గజ ఈతగాళ్లు, పడవలను ఏర్పాటు చేయడమే కాక, పోలీసులు అత్యంత అప్రమత్తంగా ఉండి సేవలు అందించారు. బుధవారం రాత్రి 11గంటల వరకు 243 మంది గణపయ్యలు సందడిగా తల్లి ఒడికి చేరగా, గురువారం అంతకు మించిన ఉత్సాహంతో బాజాభజంత్రీల నడుమ సందడిగా సాగర, గోదావరి జలాల్లోకి వెళ్లిపోయారు. రెండు రోజుల్లో సుమారు 450 విగ్రహాలకు పైబడి నిమజ్జనాలు జరిగినట్టు అధికారులు అంచనా వేశారు. ఆర్డీఓ సత్యనారాయణ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ స్వప్న, తహసీల్దార్ మురార్జీ, ఈఓ పీఆర్డీ శ్రీరామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరత్నం, వీఆర్వోలు, ఉత్సవ కమిటీ సభ్యులు, సర్పంచ్ సూరాడ చిన్ని, రాజు ఏర్పాట్లు చేశారు.

కరపలో..

కరప: మండల గ్రామాల్లో గణపతి నవరాత్రి మహోత్సవాలు కోలాహలంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వినాయక ఆలయాల వద్ద లడ్డూ ప్రసాదాలకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. బొజ్జ గణపయ్యను బ్యాండ్ మేళాలతో, బాణసంచా కాల్పులతో ఊరేగిస్తూ ఉత్సాహంగా గ్రామోత్సవం జరిపారు. గొర్రిపూడి, వేములవాడ గ్రామాల విగ్రహాలను తుల్యభాగలోను, గోదావరి ప్రవహించే అరట్లకట్ట, పెనుగుదురు కేఎంజే పంట కాలువల్లో నిమజ్జనం చేశారు. వేళంగిలో రాత్రి తెల్లవార్లు సంబరం జరిపి వినాయకుడిని ఊరేగించి తుల్యభాగ నదిలో నిమజ్జనం చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి నిమజ్జనోత్సవాన్ని తిలకించారు. ఎస్ఐ ఎస్.రామకృష్ణ, ఏఎస్ఐలు ఎ.ప్రసన్నకుమార్ సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించారు.



సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనానికి వినాయక విగ్రహాలను తీసుకువెళ్తున్న భక్తులు

పారిశుధ్య కార్మికులకు సన్మానం

కాకినాడ రూరల్: స్వచ్ఛత హీ సేవలో భాగంగా గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను గురువారం ఘనంగా సన్మానించారు. సూర్యారావుపేట గ్రామంలో బీచ్ వద్ద గణపతి నిమజ్జనాల సందర్భంగా ఉత్సవాల తొమ్మిది రోజులు విధుల్లో పాల్గొన్న సూర్యారావుపేట, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట, సర్పవరం, తిమ్మాపురం, చీడిగ, ఇంద్రపాలెం పంచాయతీల క్లాప్ మిత్రను ఘనంగా సన్మానించారు. సూర్యారావుపేట గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద క్లాప్ మిత్రలు 40మందిని ఈఓ పీఆర్డీలు శ్రీరామాంజనేయులు, భైరవమూర్తి, ఎంఎస్ఎన్ రెడ్డి, పంచాయతీ సర్పంచ్ సూరాడ చిన్ని, రాజు, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరత్నం తదితరులు సన్మానించారు. సర్పంచ్ చిన్ని, కార్యదర్శి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ, అడిషనల్, అడ్మిన్ ఎస్పీలకు..

సూర్యారావుపేట బీచ్‌లో గణపతి నిమజ్జనోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, పోలీసులకు కాకినాడ నగర, రూరల్ గణేష్ ఉత్సవ కమిటీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. అడిషనల్ ఎస్పీలు శ్రీనివాసరావు, ఏఆర్ అడ్మిన్ ఎస్పీ సత్యనారాయణ, ఆర్డీఓ సత్యనారాయణ తదితరులను ఘనంగా సన్మానించారు.



సూర్యారావుపేట బీచ్ వద్ద ఆర్డీఓ సత్యనారాయణ, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, అడ్మిన్ ఎస్పీ సత్యనారాయణలను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



క్లాప్ మిత్రలను సన్మానిస్తున్న అధికారులు

నగరంలో..



నిమజ్జనానికి తరలివచ్చిన మండప నిర్వాహకులకు ప్రశంసాపత్రం ఇస్తున్న నగర గణేశ ఉత్సవ సమితి సభ్యులు

బోట్‌క్లబ్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల్ని గురువారం నిమజ్జనం చేశారు. స్థానిక వార్ఫురోడ్డులోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాల వద్ద నిమజ్జనాల కోలాహలం నెలకొంది. నిమజ్జనం చేసేందుకు వచ్చిన వినాయకుల మండప నిర్వాహకులు నగర గణేశ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రశంసా పత్రం అందించారు.

భోగి గణపతి పీఠంలో సాంప్రదాయ నిమజ్జనం

స్థానిక భోగి గణపతి పీఠంలో సంప్రదాయ నిమజ్జనం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో పూజించిన మట్టి గణపతిని పీఠం ప్రాంగణంలో గంగా జలాల పాత్రలో ఉంచి కరిగిన తర్వాత ఆ మట్టిని వేప, రావి చెట్ల వద్ద పోశారు. ఈ సందర్భంగా రమణరాజు మాట్లాడుతూ ప్రకృతి తత్వం యావత్తు గణేశ ఆరాధనలో ఇమిడి ఉందన్నారు. పర్యావరణ ప్రగతి మానవ కల్యాణానికి దోహదమవుతుందన్నారు.

సాహితీ లోకానికి జాషువా విశేష కృషి



గుర్రం జాషువాకు నివాళి అర్పిస్తున్న నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ సత్యకుమారి



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసాద్ తదితరులు

బాలాజీచెరువు: సాహితీ లోకానికి గుర్రం జాషువా విశేషమైన కృషి చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో జాషువా జయంతి నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ సాహితీ లోకానికి విశేష కృషి చేసిన తెలుగు కవి జాషువ అని, ఆయన కవితలు కేవలం కళాత్మక వ్యక్తీకరణకే పరిమితం కాకుండా సామాజిక సమస్యలు పరిష్కరించే దిశగా నిలిచాయన్నారు. గ్రంథాలయ ఉప అధికారి కిశోర్, ఉద్యోగుల సంఘ అధ్యక్షులు తుమ్మలపల్లి జయకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కవితే ఆయుధంగా జాషువా పోరాటం

బోట్‌క్లబ్: ఆధునిక కవుల్లో గొప్ప పేరొందిన విశ్వకవి గుర్రం జాషువా అని నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి సత్యకుమారి అన్నారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలచిన వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరుగుబాటు చేశారన్నారు. మేనేజర్ కె.సత్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ ప్రసాదరావు, డీఈ లోవరాజు పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని గురువారం నిర్వహించారు. సాహితీవేత్త శిరీష, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు తదితరులు నివాళులర్పించారు.

డిసెంబర్‌లో కేబీఏ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో డిసెంబరులో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు భారీస్థాయిలో నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి పేర్కొన్నారు. కాకినాడలో గురువారం ఆ సంఘం తొలి సమావేశం నిర్వహించారు. ముందుగా బ్యాడ్మింటన్ సంఘ సభ్యుడు, దివంగత డాక్టర్ కె.స్వర్ణన్‌రాజు మృతికి సభ్యులు మౌనం పాటించారు. అనంతరం సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి మాట్లాడుతూ కాకినాడ సీపోర్ట్స్ 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆ సంస్థ సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బ్యాడ్మింటన్ సంఘ కార్యదర్శి చుండ్రు గోవిందరాజు మాట్లాడుతూ అండర్-17 బాలురు, బాలికలు డబుల్స్, పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు. రెండు రాష్ట్రాల నుంచి సమారు 200 మంది హాజరుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బ్యాడ్మింటన్ సంఘ వ్యవస్థాపకుడు కర్రి భామిరెడ్డి, ప్రసాద్ వర్మ, ఒలింపిక్ సంఘ కోశాధికారి కొండలరావు, సీపోర్టు సీఈఓ, బ్యాడ్మింటన్ సంఘ ఉపాధ్యక్షుడు ఎం.మురళీధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరాజు, పాల్గొన్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి తదితరులు

కేసీబీఎస్‌లో ఉచిత వైద్య శిబిరం



సభ్యులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బోట్‌క్లబ్: ది కాకినాడ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం సొసైటీ ట్రినిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదుస్సు, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం సంఘ సభ్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు రెడ్డి వీర రాజేంద్రకుమార్, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, కోసూరి లక్ష్మీ ప్రసాద లావణ్య, ఇన్‌చార్జి మేనేజర్ చీమలకొండ గంగాధరం పాల్గొన్నారు.

నడకతో గుండె పదిలం

- ఎస్పీ సతీష్‌కుమార్
- అపోలో ఆధ్వర్యంలో త్రీకే వాక్

కాకినాడ క్రైం: దిన చర్యలో నడక ఓ భాగంగా చేసుకుంటే గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ గుండె వ్యాధుల నివారణ దినోత్సవం సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు స్థానిక అపోలో ఆసుపత్రి యాజమాన్యం త్రీ కే వాక్ నిర్వహించింది. యూనిట్ సీఈవో ఐవీ రమణ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్‌లోని అపోలో ఆస్పత్రి ఆవరణలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యాన్ని పదిలపరుచుకోవాలని సూచించారు. ఏటా 30 శాతం మరణాలు గుండె జబ్బులు, సంబంధిత అనారోగ్యాల వల్లే జరుగుతున్నాయని అపోలో గుండె వ్యాధుల నిపుణుడు టి.వెంకటేశ్వరరావు అన్నారు. నడక, సరైన జీవన విధానం, కంటి నిండా నిద్ర గుండె జబ్బులను దూరం చేస్తాయని గుండె వ్యాధుల శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మెయిన్ రోడ్‌లో అపోలో ఆసుపత్రి నుంచి భానుగుడి కూడలి వరకు సాగింది. ఈ ర్యాలీలో పోలీస్ అధికారులతో పాటు అపోలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జేసన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జీవీఆర్ మూర్తితో పాటు ఆసుపత్రి సిబ్బంది, ఫైడా, కైట్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



ముస్లింలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి

బోట్‌క్లబ్: నగరంలో ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు గురువారం ఎంతో వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలీద్ బిన్ వలీ ఆధ్వర్యంలో స్థానిక జామియా మసీద్‌లో నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ముఖ్య అతిథులుగా పాల్గొని వారికి స్వీట్లు పంపిణీ చేశారు. కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుసుపులేటి వెంకటలక్ష్మి, శాన్ మెరైన్ అధినేత అహ్మద్ అలీషా, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ట్రెజరర్ కర్రి చినబాబు, మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి అబ్దుల్ బషీరుద్దీన్, మైనార్టీ సెల్ నాయకులు బాషా, రెహమాన్‌ఖాన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



మరిడమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రాలతో వైభవంగా హోమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.